ప్రజాశక్తి
సోమవారం 28, నవంబర్ 2022 5 అనంతపురం



రజక వృత్తిదారులకు పనిముట్లు ఇవ్వాలి

సంఘం కన్వీనర్ నాగభూషణం

అనంతపురం కలెక్టరేట్ : రజక వృత్తిదారులకు పనిముట్లు ఇవ్వాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షులు ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. ఆదివారం గణేనాయక్ భవన్‌లో సంఘం నగర కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో రజకులు వివక్షకు గురవుతున్నారన్నారు. వీరికి సరైన దోబీఘాట్‌లు లేవన్నారు. కొనిఘాట్లు ఉన్నా మోటార్లు, విద్యుత్ సౌకర్యం లేదన్నారు. నగరంలో రజక వృత్తిని నమ్ముకుని వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని, వారందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం నాయకులు రాముడు, మధు, వెంకటేశు, రాము, హరి, చింతప్ప, రాజు, నాగరాజు, రామాంజి, సుజాత, లక్ష్మీదేవి, ఓబులమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ఫలితాల అనంతరం డైరెక్టర్లతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న జెఎల్.మురళీధర్

జెఎల్.మురళీ ప్యానల్ విజయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సాధారణ ఎన్నికలకు మించి అనేక మలుపులు, ఉత్కంఠతో గతేడాది నుంచి కొనసాగుతూ వచ్చిన టౌన్ బ్యాంకు సహకార బ్యాంకు ఎన్నికల ఫలితాలు ఎట్టకేలకు వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో మునుపటి ఛైర్మన్ జెఎల్ మురళీ ప్యానల్‌కు సంబంధించిన వారే మొత్తం 12 మంది డైరెక్టర్లుగా విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో అధికార వైసిపి మద్దతుదారులెవరూ పాల్గొనలేదు. పోటీపడిన రెండు ప్యానళ్లు కూడా ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీకి సంబంధించినవారే ఉన్నారు. ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మద్దతుదారులుగానున్న మార్కెట్ మహేష్ ప్యానల్ ఉండగా ఇటువైపు జెఎల్.మురళీ ప్యానల్ ఉన్నారు. జెఎల్ మురళీ కూడా ముందు ప్రభాకర్ చౌదరి గ్రూపులోనే ఉన్నప్పటికీ గత ఎన్నికలకు ముందే జెసి.ప్రభాకర్‌రెడ్డి గ్రూపులో చేరారు. ఈ ఇద్దరు నాయకుల మధ్య ముందు నుంచి పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. దీంతో ఈ ఎన్నికలు అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి మద్దతుదారుల మధ్య కాకుండా ప్రతిపక్ష టిడిపిలోని గ్రూపు ఆధిపత్య పోరులాగానే సాగింది. అయితే ఈ ఎన్నికల వ్యవహారం మొత్తం ఏడాది కాలంగా సాగుతూనే వస్తూ వచ్చింది. ఈ ఏడాది మే 31వ తేదీన ఎన్నికలు జరిగాయి. 12 డైరెక్టర్ల స్థానాలకు జరిగిన ఎన్నికలకు 31 మంది పోటీపడ్డారు.

టౌన్ బ్యాంకు ఎన్నికల ఫలితాలు వెల్లడి
అనేక రోజుల ఉత్కంఠకు తెర

6972 ఓట్లకు గానూ 3070 ఓట్లు పోలయ్యాయి. అంటే 44.04 శాతం ఓట్లు ఈ ఎన్నికల్లో పోలయ్యాయి. ఎన్నికల అనంతరమే ఓట్ల లెక్కింపు జరగాల్సి ఉన్నప్పటికీ న్యాయపరమైన సమస్యలతో వాయిదాపడుతూ వచ్చాయి. తాజాగా ఓట్ల లెక్కింపునకు లైన్ క్లియర్ కావడంతో ఆదివారం నాడు ఓట్ల లెక్కింపు నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో జరిగింది. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తరువాత అందరిలోనూ ఉత్కంఠతనే నెలకొంది. ఎవరిని పై చేయి కానుందోనని ఆసక్తిగా అందరూ గమనించారు. అయితే మొదటి నుంచి జెఎల్ మురళీ ప్యానల్‌కు సంబంధించిన వారే ముందంజలో ఉంటూ వచ్చారు. చివరకు 12 డైరెక్టర్ల స్థానాలను జెఎల్.మురళీ ప్యానల్ క్లైవసం చేసుకుంది.

ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయి

జెఎల్ మురళీ (1671), కృష్ణకుమార్ పెరవలి (1784), జంగటి శెట్టి రామాంజినేయులు (1692), జి.సుబ్రమణ్యం (1640), మాగిశెట్టి చంద్రశేఖర్ (1634), జి.వెంకటాద్రి (1625), రమేష్ సుంకర (1616), భాస్కర్ రెడ్డి (1615), ఎస్.బాషా (1604), బావిగాడ్డ రమణయ్య (1603), చింతా భాస్కర్ (1599), కె.రాధా (1581) ఓట్లు వచ్చాయి.

మామూళ్లు ఇచ్చుకో..కల్లు అమ్ముకో..

ఏదైనా చిన్న వ్యాపారం చేయాలన్నా వివిధ శాఖల అనుమతులు అవసరం. ఇక మద్యం, కల్లు వ్యాపారాలు అంటే నిబంధనలు కఠిన తరంగా ఉంటాయి. నకిలీ మద్యం, కల్లు ప్రాణంతకం కావడంతో వాటి విక్రయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుంది. ఇందుకోసమే ఏర్పాటు అయిన ఎక్సైజ్ శాఖలో నిబంధనలు కష్ట తరంగా ఉంటాయి. అనుమతులు లేకుండా ఒక్క సీసా మద్యం కాని, కల్లు కాని విక్రయిస్తే కేసులు నమోదవుతాయి. విక్రయించిన వారు జైలుకెళ్లాల్సిందే. అయితే కల్తీకల్లు వ్యాపారం జోరుగా సాగుతున్నా పట్టించుకోకుండా మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు జోగుతుండడం గమనార్హం.

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లాలో కల్లు దుకాణాల విక్రయాలకు సెప్టెంబర్ నెలకి కాల పరిమితి ముగిసింది. ఎక్సైజ్ శాఖ అనుమతులు లేకుండా అక్టోబర్ 1వ తేదీ నుంచి ఒక్క సీసా కల్లు కూడా అమ్మడానికి లేదు. అయితే ప్రభుత్వం నెల రోజులు అనుమతుల కాలపరిమితి పెంచుకోవడానికి కల్లు వ్యాపారులకు అవకాశం కల్పించింది. ఆ నెల రోజులు కూడా గడిచినప్పటికీ కల్లు వ్యాపారులు ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే జిల్లా వ్యాప్తంగా కల్లు వ్యాపారాలను కొనసాగిస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలోని హిందూపురం, మండకశిరా నియోజకవర్గాలు టాడి హబ్‌గా పేరొందాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 400 దాక అధికారికంగా కల్లు దుకాణాలు ఉన్నాయి

అనుమతులు లేకనే జోరుగా వ్యాపారం
ఏరులై పారుతున్న కల్తీకల్లు

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో, అధికార పార్టీకి చెందిన ప్రజా ప్రతినిదుల కనుసన్నల్లో అనుమతులు లేకుండానే నడిచే కల్లు దుకాణాలు వందల్లో ఉన్నట్లు తెలుస్తోంది. కల్లు దుకాణాల నిర్వహణకు సంబంధించి కాలపరిమితి ముగియడానికి ముందే వ్యాపారులు కాలపరిమితి పొడిగించుకోవాడానికి ఎక్సైజ్‌శాఖకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఎక్సైజ్‌శాఖ, వ్యాపారుల మధ్య డీల్ కుదరకపోవడంతో ఇంతవరకు కాలపరిమితి పొడిగిస్తూ ఆ శాఖ ఉత్తర్వులు ఇవ్వలేదు. కాలపరిమితి ముగిసిన వెంటనే వ్యాపారాలను నిలుపుదల చేయాలి. అయితే అధికారులు వ్యాపారుల నుంచి భారీగా మాముళ్ల తీసుకుని వారి కనుసన్నల్లోనే వ్యాపారాలు జోరుగా సాగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వ్యాపారాల్లో అధికార పార్టీ నాయకులు

అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులతో పాటు హిందూపురంలో ఓ ప్రజాప్రతినిది సైతం కల్లు వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించడానికి భయపడుతున్నట్లు తెలుస్తోంది. హిందూపురానికి చెందిన ప్రజా ప్రతినిధి ఒకరు పరిగి మండలం గొల్లపల్లి వద్ద డిపో నిర్వహణకు అనుమతులు తీసుకున్నట్లు తెలుస్తోంది. అక్కడ కల్తీ కల్లు సిద్ధం చేసి హిందూపురం, పరగి, లేపాక్షి మండలాల్లో దాదాపు 100 నుంచి 120 కౌంటర్లను ఏర్పాటు చేసి వ్యాపారాలు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పరిగి మండలం బీచుగానపల్లిలో వన్నప్ప అనే వ్యక్తి 11 మందితో సోసైటీని ఏర్పాటు చేసుకున్నారు. అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే అందులో ముగురిని తొలగించి, కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసుకున్నట్లు సమాచారం. ఇలా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నా ఎక్సైజ్ శాఖలో చలనం మాత్రం కనిపించడం లేదు.



హిందూపురం రూరల్ మండలంలో జోరుగా సాగుతున్న కల్లు వ్యాపారం

చెట్లు తక్కువ..కల్లు ఎక్కువ..

హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో చెట్లు తక్కువగా ఉన్నా కల్లు వ్యాపారం మాత్రం మూడు చెట్లు.. 300 సీసాలు అన్న చందంగా సాగుతోంది. ప్రశ్నిస్తే పాత రికార్డులు తెరిచి గ్రామాల్లో ఈత వనాలు ఉన్నాయంటూ 50 సంవత్సరాల నాటి లెక్కలను నేటికి చూపిస్తూ పబ్బం గడుపుతున్నారు. ఈత చెట్లే లేకపోయినా ఈ ప్రాంతంలో భారీగా కల్లు ఉత్పత్తి జరుగుతోంది. ఈ కల్లు అంతా చెట్ల నుంచి వచ్చిన కల్లు అనుకుంటే పొరబడినట్లే. ఇక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీలోకి చేరి కొందరు బడా కల్లు వ్యాపారులు నకిలీ కల్లు వ్యాపార కేంద్రాలు పెట్టుకుంటున్నారు. ప్రమాదకరమైన క్లోరైల్, హైడ్రేడ్, డైజోఫామ్ తదితర రసాయనాలను ఉపయోగించి కల్లు లాంటి తెల్లటి విషాన్ని తయారుచేసి మందుబాబులపై ప్రయోగిస్తున్నారు. దీనికి అలవాటుపడిన వారు తాగకుండా ఉండలేని పరిస్థితి. ఈ విషపు కల్లుతాగి క్రమంగా ఆరోగ్యం క్షీణించి ప్రాణాలు పోగొట్టుకుంటున్న అభాగ్యులు ఎందరో. గతంలో లేపాక్షి మండలం తిమ్మగానిపల్లి గ్రామంలో కల్తీకల్లు దొరక్కపోవడంతో దాదాపు 10 మందికిపైగా పిచ్చివాళ్లుగా మారిపోయారు. అందులో ఒక వ్యక్తి కాల్చుకుని చనిపోయాడు. మరికొంతమంది వింత వ్యాధితో బాధపడిన సంఘటనలు సైతం ఉన్నాయి. ప్రతినెలా కల్లు షాంపుల్స్ ప్రయోగశాలకు పంపిస్తున్నా అంతా సక్రమంగానే ఉన్నాయంటూ నివేదికలు వస్తున్నాయంటే కల్తీకల్లు మాఫియా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా సెబ్, ఎక్సైజ్ శాఖలు సంయుక్తంగా అనుమతులు లేని కల్లు దుకాణాలపై దాడులు చేయాలి. అనుమతులు లేని వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

తోపుదుర్తి బ్రదర్స్..నోరు అదుపులో పెట్టుకోండి

మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి, రాయదుర్గం

తోపుదుర్తి బ్రదర్స్ నోరు అదుపులో పెట్టుకోవాలని, జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రజాస్వామ్యానికి అడుగడుగునా అవరోధాలు ఎదురవుతున్నాయని మాజీ మంత్రులు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరును ఖండిస్తూ వారు టిడిపి నాయకులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ఆదివారం నిరసన తెలిపారు. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట మాజీ మంత్రి పరిటాల సునీత, సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బికె.పార్థసారథి, పరిటాల శ్రీరామ్ టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి నిరసన తెలియజేశారు. రాయదుర్గం పట్టణంలోని కనేకల్లు రోడ్డులో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు బైఠాయించారు. ఈ సందర్భంగా వారు ఇటీవల రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ బాబుతో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పత్రికా విలేకరులను అసభ్య పదజాలంతో దూషించడంపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యం అంగీకరించని, పశుభాషతో మాట్లాడిన చంద్రశేఖర్‌రెడ్డిపై ఎందుకు ఇంతవరకు కేసు నమోదచేసి చర్యలు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. తోపుదుర్తి సోదరులపైన టిడిపి కార్యకర్త గంటాపురం జగ్గు ప్రశ్నించినందుకు అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని నిలదీశారు. స్టేషన్‌లో నిర్బంధించిన జగ్గును చూడటానికి వెళ్లిన ఆయన బంధుమిత్రులపై కనగానిపల్లి వైసిపి నాయకులు పాశవికంగా దాడిచేయడం దుర్మార్గం అన్నారు. టిడిపి కార్యకర్తలపై ఒక పక్క పోలీసులు, మరో పక్క వైసిపి నాయకులు దాడులు చేస్తే ఎక్కడికి వెళ్లి తలదాచుకోవాలని ప్రశ్నించారు. ఎస్ఐ ఎదుటే వైసిపి నాయకులు టిడిపి కార్యకర్తలపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. తమ రాజకీయ అనుభవంలో ఇలాంటి చెత్త ప్రభుత్వాన్ని తామెప్పుడూ చూడలేదని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పాశవిక నిర్బంధాలతో పోలీసు వ్యవస్థ ఏకపక్షంగా వైసిపి నాయకులకు కొమ్ముకాస్తోందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించడం మానేసి, పోలీసు వ్యవస్థను పూర్తిగా ప్రతిపక్ష నాయకులపైకి ఉసిగొల్పుతున్నాడని విమర్శించారు. పౌరుల కదలికలకు, స్వేచ్ఛకు భంగం కలిగించే హక్కు పోలీసులకు ఎవరిచ్చారని సూటిగా ప్రశ్నించారు. జగన్‌రెడ్డిని నమ్ముకుని పనిచేస్తున్న పోలీసు వ్యవస్థ భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. తక్షణమే చెన్నేకొత్తపల్లి ఎస్ఐ, సిఐ లను సస్పెండ్ చేయాలని, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిని అరెస్టు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని, టిడిపి కార్యకర్తపై పెట్టిన తప్పుడు కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మీరు చెప్పిన విధంగా ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని డీఎస్పీ హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



పోలీసులతో మాట్లాడుతున్న పరిటాల సునీత

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అరెస్ట్

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులును రాయదుర్గంలో పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ మంత్రి పరిటాల సునీతకు సంఘీభావం తెలిపేందుకు వెళతారన్న ఉద్దేశంతో కాలవ శ్రీనివాసులును పోలీసులు అడ్డుకున్నారు దీంతో ఆయన స్థానిక టిడిపి కార్యాలయం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు కాలవను అరెస్టు చేసి ఆయన స్వగృహానికి తరలించారు.

సకాలంలో బిల్లులు పాస్ చేస్తున్నాం

పిఆర్‌సి అమలులో ప్రథమ స్థానం జిల్లాదే..
జిల్లా ఖజానా శాఖ డిడి జె.సరళ విజయకుమారి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ శాఖలు పంపుతున్న బిల్లులన్నీ సకాలంలో పాస్ చేసి ఆర్‌బిఐకు పంపడంలో జాప్యం లేకుండా పనిచేస్తూ ఉద్యోగులకు సకాలంలో జీతభత్యాలు అందించడంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఖజానా శాఖ డిప్యూటీ డైరెక్టర్ జె.సరళ విజయకుమారి తెలిపారు. ప్రజాశక్తితో ముఖాముఖి సందర్భంగా ఆమె అనే విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న : బిల్స్ పాస్ చేయడంలో జాప్యం జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మీరేమంటారు ?

జవాబు : సబంధిత శాఖ నుంచి బిల్స్ వస్తుంటాయి. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సదరు ఫార్మెట్‌లో బిల్స్ పెట్టి ఉంటే తక్షణమే పాస్ చేస్తున్నాం. చిన్న చిన్న పొరపాట్లు ఉంటే సరిచేసుకుని వచ్చిన వెంటనే పాస్ చేస్తున్నాం. ఎక్కడైనా బిల్ ఆగిందని తమ దృష్టి వస్తే ప్రత్యక్షంగా పరిశీలించి జరిగిన జాప్యం, అందుకు గల కారణాలను సదరు శాఖ అధికారులకు తెలియపరుస్తున్నాం. వాటిని సరిచేసి పంపితే వెంటనే బిల్లులు పంపుతున్నాం. జిల్లా ఖజానా శాఖ స్థాయిలో బిల్లులు ఆగే పరిస్థితి ఉండదు. ఫండ్ క్లియరెన్స్ ఉంటే సంబంధిత బిల్లులన్నీ సజావుగా పాస్ అవుతాయి.



ప్రశ : సర్వర్ సమస్య ఉందని విన్నాం.. నిజమేనా ?

జవాబు : సర్వర్ సమస్య అప్పుడప్పుడు ఉత్పన్నం అవుతుంది. బిల్స్ ఒకేసారి అప్‌లోడ్ చేయడంతో లోడ్ ఎక్కువ కావడం వల్ల సర్వర్ ప్రిక్వెన్సీ తక్కువ ఉండటం జరుగుతోంది. సాధ్యమైనంత వరకు అంతగా సమస్యలు తలెత్తలేదు. 5జి సదుపాయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే సర్వర్ సమస్య రాదు. సాంకేతిక సమస్యలు అందరికి సర్వసాధారణంగా వచ్చేవే. ప్రధాన శాఖ కావడంతో ప్రభుత్వం సర్వర్ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటోంది.

ప్రశ్న : ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరు జరుగుతోందా ?

జవాబు : గ్రామీణ స్థాయిలో నెట్ సమస్య కొంత ఉంది. కొండ, గుట్ట ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా రాదు. అయినా తమ ఉద్యోగులు ఎవరు ఎక్కడ ఏ పని చేస్తున్నారన్నది మాకు తెలిసిపోతుంది. బయోమెట్రిక్ హాజరు సరిగానే జరుగుతోంది. ఉద్యోగులు సమన్వయంతో పని చేస్తున్నారు. ఉద్యోగులు అందుబాటులో లేకపోతే తెలిసిపోతుంది. పని ఆగిపోతే తప్పకుండా సదరు ఉద్యోగి చేయాల్సి ఉంటుంది. కావున ఉద్యోగులు తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. అందుకే పిఆర్‌సి అమలులో జిల్లా ఖజానా శాఖ ప్రథమ స్థానంలో నిలిచింది. ఆర్‌టిసి ఉద్యోగుల ప్రభుత్వం విలీనం, వారి జీత భత్యాలు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సదుపాయాలు వంటివి సకాలంలో పూర్తిచేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచాం.



ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా ?

జవాబు : సిబ్బంది కొరతేమీ లేదు. ఉన్న ఖాళీలు ప్రభుత్వమే డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తోంది. జిల్లా విభజన జగిగిన తరువాత పని విభజన జరగడం వల్ల కొంత సులభతరంగా మారింది. ఉద్యోగుల పదోన్నతుల విషయంలో కూడా రోస్టర్ పాయింట్ ఆధారంగా చర్యలు తీసుకుంటున్నాం. వేకెన్సీ ఆధారంగా ప్యానల్ ఆర్డర్ ప్రకారం అప్రూవల్ తీసుకుని చేస్తున్నాం.



అభివాదం తెలుపుతున్న ఆవాజ్ నాయకులు

హిందుత్వ రాజకీయాలతో దేశ సమగ్రతకు ముప్పు

ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శిచిష్టి

అనంతపురం కలెక్టరేట్ : కేంద్రంలో బిజెపి చేస్తున్న హిందుత్వ రాజకీయాలతో దేశ సమగ్రతకు, సమాజ మనుగడకు ముప్పు వాటిల్లుతోందని ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎంఎ.చిష్టి అన్నారు. ఆవాజ్ జిల్లా 2వ మహాసభలు అనంతపురం జిల్లా కేంద్రంలోని వికె మెమోరియల్ హాల్ అబ్బాస్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ న్యాయవాది అబ్దుల్ రసూల్ అధ్యక్షతన మైనార్టీల మౌలిక హక్కుల సాధన అనే అశంపై నిర్వహించిన ఆవాజ్ జిల్లా మహాసభల సదస్సుకు ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీం అహమ్మద్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నూర్‌మహ్మద్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు ఎస్.నాగేంద్రకుమార్, ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముస్కిన్‌వలి, ఐఎంఎం మహబూబ్‌బాషా తదితరులు హాజరయ్యారు. ముందుగా సిపిఎం నాయకులు అబ్బాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి చిష్టి మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల హక్కుల ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన శాంతి, స్వేచ్ఛ, సమానత్వం విచ్చిన్నం జరుగుతోందన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ హిందుత్వ రాజకీయాలను సమాజంపై జొప్పించి చీలక సృష్టిస్తోందన్నారు. నాడు స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిములు పోరాటాలు చేసిన చరిత్ర తెలిసి కూడా ఇలాంటి వ్యత్యాసం తీసుకురావడం సరికాదన్నారు. ఇలాంటి ప్రమాదాన్ని అందరూ గ్రహించాలన్నారు. అరాచక శక్తులు ఏకమయ్యాయని, లౌకిక వాదులు, అభ్యుదయ వాదులు, మేధావులు ఐక్యమత్యంలో దేశ సమగ్రతను కాపాడాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముస్లిం జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ కల్పించాలని జస్టిస్ సచార్ రంఘునాథ్‌మిశ్ర కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ నదీం అహమ్మద్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ నూర్‌మమ్మద్ మాట్లాడుతూ మంచి ఆశయం కోసం పోరాడేటప్పుడు అనేక అవాంతరాలు ఎదురవుతాయని, చివరికి విజయం వరించడం ఖాయం అన్నారు. సమాజంలో విద్యతోనే మంచి గుర్తింపు ఉందని, ముస్లిములు తమ పిల్లలకు విద్యాబోధన చేయించి అభివృద్ధి చెందాలన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ హిందూ ముస్లిం ఐక్యతను దెబ్బతీసేలా కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ముస్లిం మైనార్టీలు, దళితుల్లో అభద్రతాభావం నెలకొనడం బాధాకరం అన్నారు. ముస్లిం మైనార్టీలకు సబ్‌ప్లాన్ ఏర్పాటు చేసి బడ్జెట్ వాటా కేటాయించాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కమిటీ నాయకులు ఎస్.నాగేంద్రకుమార్ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల హక్కుల సాధన కోసం ఐక్యం కావాలన్నారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముస్కిన్ మాట్లాడుతూ ముస్లిములను ఓటు బ్యాంకుగా మాత్రమే రాజకీయ పార్టీలు చూడటం అన్యాయం అన్నారు. వారికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేయాలన్నారు. ఐఎంఎం రాష్ట్ర నాయకులు మహబూబ్‌బాషా మాట్లాడుతూ ముస్లిముల కోసం పోరాడుతున్న ఆవాజ్‌తో భాగస్వామిగా చేరుదామని కోరారు. ఆవాజ్ నగర కార్యదర్శి వలి మాట్లాడుతూ ముస్లిముల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలు చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఆవాజ్ జిల్లా నూతన కమిటీనిఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వలీ, ప్రధాన కార్యదర్శిగా ముస్కిన్‌వలీ, కోశాధికారిగా అబ్దుల్లాతో పాటు 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులను పరీక్షలు రాయకుండా అడ్డుకోవడం దారుణం

ఎస్‌కెయు అధికారులు పునరాలోచించాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్


ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ పరిధిలోని న్యాయశాస్త్ర విభాగంలో సౌకర్యాల లేమి, సమస్యలను పరిష్కరించాలని అడిగినందుకు మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను పరీక్షలు రాయకుండా అడ్డుకోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. గతంలో ఐడి కార్డుల ఇవ్వాలని, క్లాస్‌రూమ్‌లో బ్లాక్ బోర్డు ఏర్పాటు చేయాలని, హాస్టల్ మెస్ బాగోలేదని వివిధ విభాగాల్లో చదువుతున్న విద్యార్థులు ప్రిన్సిపల్‌కు లేఖలు రాశారన్నారు. ఈనేపథ్యంలో న్యాయశాస్త్ర విభాగంలో మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షలు నవంబర్ 28న ప్రారంభమవుతున్నాయన్నారు. వారంరోజుల క్రితం పరీక్షకు అర్హులైన వారిని ప్రకటిస్తూ సర్క్యులర్ జారీ చేయగా ఇందులో 9 మందిని అనర్హులుగా ప్రకటించడం బాధాకరమన్నారు. అలాగే ఆదివారం మరో 38 మందిని అనర్హులుగా ప్రకటించడంతోపాటు 25 మందిని హాజరు తక్కువ ఉన్నందున ఫీజు కట్టాల్సిందిగా సర్క్యులర్ జారీచేయడం విడ్డూరంగా ఉందన్నారు. కావున విద్యార్థులందరితో పరీక్షలు రాయించాలని డిమాండ్ చేశారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు పోరాటం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చేంత వరకు పోరాటం కొనసాగిస్తామని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుభాష్‌చంద్రబోస్, జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి కరూర్ శివశంకర్ స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విఆర్‌పిఎస్ రాష్ట్రస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ వాల్మీకి రిజర్వేషన్ పోరాట సంఘం గ్రామీణ స్థాయి, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి వాల్మీకి బోయలను ఐక్యం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వాల్మీకులు, బోయలను ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఆర్‌పిఎస్ జిల్లా యూత్ ప్రెసిడెంట్ కాయల మహేష్, గుంతకల్ నియోజకవర్గం అధ్యక్షులు హెూటల్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న జడ్జి తిరుమలరావు దంపతులు

నేమకల్లు అంజన్నను దర్శించుకున్న జడ్జి

బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామిని అనంతపురం జిల్లా మొబైల్ కోర్టు జడ్జి తిరుమలరావు కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఎన్‌సిసి ఆవిర్భావ దినోత్సవం


గుంతకల్లు : పట్టణంలోని శ్రీ శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం కళాశాల ఎన్‌సిసి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రిన్సిపల్ పి.గోపాల్ ఎన్‌సిసి జెండాను ఆవిష్కరించి ఎన్‌సిసి క్యాడెట్ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు దశాబ్దాలుగా దేశ యువత, విద్యార్థులకు మార్గదర్శకత్వం వహిస్తూ ఎన్‌సిసి ఎంతో మంది జీవితాలకు బంగారు బాటలు వేస్తోందన్నారు. ఎన్‌సిసి శిక్షణతో ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరులుగా సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి లెఫ్టినెంట్ ఆఫీసర్ జి.ప్రకాష్, కేర్ టేకర్ ఆఫీసర్ లాన్స్ ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల పరిశీలన

గుంతకల్లు : పట్టణంలోని దోనిముక్కల రోడ్డులో ఉన్న జగనన్న ఇళ్లు, టిడ్కో ఇళ్లను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేవరగుడి జగదీష్ బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం జగనన్న కాలనీలు పేరుతో నిర్మిస్తున్న ఇళ్లు నత్తనడకన సాగుతున్నాయన్నారు. నిర్మాణాలకు అవసరమైన సామగ్రిని సకాలంలో అందించడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. డిసెంబరు నాటికి లక్షలాది ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందిస్తామని సిఎం జగన్ చెబుతున్న మాటలు నీటి మూటలు అయ్యాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేద ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి ఇవ్వాలని లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటన బృందంలో సిపిఐ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు బి.గోవింద, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి బి.మహేష్, మండల కార్యదర్శి రామురాయల్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

గుంతకల్లు రూరల్ : మండల పరిధిలోని గుండాల తండాలో పిజెఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో అఖిల ఆసుపత్రి వైద్యసిబ్బంది ఆదివారం మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిజెఆర్ ట్రస్టు వ్యవస్థాపకులు పెరుమళ్ల జీవానందరెడ్డి మాట్లాడుతూ ఈశిబిరంలో దోసలుడికి, ముదుకులపెంట, గుండాల తండాలకు చెందిన దాదాపు 500కిపైగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. వైద్యం కోసం వచ్చిన ప్రజలకు భోజనాలు, వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా కంటి ఆపరేషన్ అవసరమైన రోగులను ఉచిత కర్నూలులోని అఖిల ఆసుపత్రికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కాగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ, సంచార వాహనాల ద్వారా ఏర్పాటు చేసిన అందిస్తున్న వైద్యం పేదలకు సక్రమంగా అందడం లేదన్నారు. అదేవిధంగా వైసిపి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని వదిలి, దౌర్జన్యాలు, కబ్జాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మెగా వైద్యశిబిరం ఇన్‌ఛార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, పెన్నార్ కాలువ ఛైర్మన్ రామలింగారెడ్డి, మాజీ ఎంపిపి నాగభూషణ, వైటీచెరువు మాజీ సర్పంచి లక్ష్మయ్య, స్థానిక నాయకులు ప్రకాష్ నాయక్, నేటునాయక్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రెవెన్యూ లీలలు..!

ప్రజాశక్తి-యల్లనూరు

రెవెన్యూ అధికారుల ధనదాహం కారణంగా మండలంలోని బుక్కాపురం గ్రామంలో భూమి లేకపోయిన ఆన్‌లైన్‌లో ఉన్నట్లు భూ మాయాజాలం చేశారు. మండలంలోని బుక్కాపురం గ్రామానికి చెందిన వీఆర్ఏ, అతని బంధువులు, స్నేహితుల పేరుమీద ఉన్న బోగస్ పాసు పుస్తకాలను పుట్టించారు. గతంలో పలు వార్తాపత్రికల్లో వరుస కథనాలు రావడంతో స్పందించిన ఉన్నతాధికారులు బోగస్ పాసుపుస్తకాలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే బోగస్ పాసుపుస్తకాలను తొలగించేటప్పుడు వీఆర్ఓకి గిట్టని కొంతమంది నిజమైన రైతుల పాసుపుస్తకాలను తొలగించి బోగస్ పుస్తకాలను మాత్రం అలాగే ఉంచారు. విషయం తెలుసుకున్న రైతులు తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి తమ పాసుపుస్తకాలు ఎందుకు తొలగించారని నిలదీయడంతోపాటు తమ దగ్గర ఉన్న సాక్ష్యాధారాలు చూపించారు. అప్పుడు తిరిగి విచారించి అర్హులందరి పాసు పుస్తకాలను తిరిగి పునరుద్ధరిస్తామని చెప్పారన్నారు. రెండేళ్ల అవుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు బ్యాంకు అధికారులు సైతం రుణాలు చెల్లించాలని, లేదంటే పాసుపుస్తకాలు తీసుకొచ్చి రెన్యూవల్ చేసుకోవాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు.

అధికారుల కాసుల కక్కుర్తి.. భూ వివాదాల్లో రైతులు.. బుక్కాపురంలో భూముల మాయ

బుక్కాపురం రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 434లో 8.3 ఎకరాల భూమి ఉండగా 2013లో 11.68 ఎకరాలుగా మార్చి వీఆర్ఏ పేరుమీద ఎక్కించుకున్నాడు. తిరిగి 2019 మార్చిలో 10.7 ఎకరాలకు పెంచి (మొత్తం 22.38) బంధువులు స్నేహితుల పేర్ల మీద బోగస్ పాసుబుక్కులను చేయించుకున్నారు. ఈ సర్వే నెంబర్‌లో కె.లక్ష్మీనారాయణకు 429బిలో 2.0 (ఎకరాల్లో), ప్రసాద్‌కు 435-8లో 2.0, ఆదిలక్ష్మికి 435-7 2.0, ఎలుట్ల శివకు 435-6లో 2.0, శశికళకు 339ఎలో 1.0, చిన్న సుబ్బయ్యకు 435-9లో 2.0, లోహితకు 436-1లో 2.0 (తిమ్మంపల్లి వి.ఆర్.ఎ), హరిప్రసాద్‌కు 436-1లో 4.0, నాగేంద్రకి 436-2లో 3.0 ఎకరాలను ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. అలాగే ఆదేవిధ రెవెన్యూ గ్రామంలో శ్రీలతకు సర్వే నెంబర్ 237లో 3.62 (ఎకరాల్లో), ఇందిరమ్మకు 242/2లో 2.50, జయమ్మకు 350సిలో 2.50, వెంకటనరసయ్యకు 352లో 2.0 ఎకరాలను ఆన్‌లైన్ చేయించుకున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అనర్హుల పాసుపుస్తకాలను తొలగించి అర్హులైన రైతుల భూములను ఆన్‌లైన్ చేసి పాసుపుస్తకాలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.



యల్లనూరు తహశీల్దార్ కార్యాలయం

రెండేళ్లవుతున్నా పట్టించుకోలేదు..
పెద్దయ్య, రైతు, బుక్కాపురం


బుక్కాపురం గ్రామ రెవెన్యూలోని 431-7 సర్వే నెంబర్‌లో 1.50 భూమిని సాగు చేసుకుంటున్నాను. దీని చెట్లను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నా. అయితే రెండేళ్ల క్రితం రెవెన్యూ అధికారులు నా పాసు పుస్తకంలోని పొలాన్ని ఆన్‌లైన్‌లో తొలగించారు. విషయం తెలుసుకుని తగిన సాక్ష్యంతో ఉన్నతాధికారుల వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశా. వారు పరిశీలించి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్ల నుంచి కాళ్లు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. అయినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని నా పొలాన్ని ఆన్‌లైన్‌లో ఎక్కించాలి.

ఇళ్ల నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇళ్ల నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని వెలిగొండ గ్రామంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన మహిళలతో కలిసి సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినట్లు తెలిపారు. సిఎం జగన్ రాష్ట్రంలో 32 లక్షల మంది పేదలకు శాశ్వత గృహ వసతి కల్పించి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ముఖ్యంగా పార్టీలకతీతంగా అర్హులందరికీ నవరత్నాల పథకాలు అందజేస్తున్నారన్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని సిఎస్ఐ చర్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేయించాలని నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డిని చర్చి ప్రతినిధులు, పెద్దలు కోరారు. ఈమేరకు చర్చి ఫాస్టర్ ప్రమీల జోసెఫ్, ప్రతినిధులు ఎంఎన్ షాహీన్, భాస్కర్, సాకే భాస్కర్, ఏసీ ఎర్రిస్వామి, తదితరులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందా చంద్రమ్మ, వైస్ ఎంపిపి నరసింహులు, జెడ్పిటిసి ఎసి పార్వతమ్మ, సర్పంచి వీరాంజినేయులు, విడపనకల్లు జెడ్పిటిసి హనుమంతు, విడపనకల్లు మండల కన్వీనర్ బసన్న, జిల్లా అధికార ప్రతినిధి వీరన్న, పట్టణ అధ్యక్షుడు బ్యాంకు ఓబులేసు, ఉరవకొండ ఉప సర్పంచి వన్నప్ప, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సుశీలమ్మ, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేష్, ఆమిద్యాల పిఎసిఎస్ ఛైర్మన్ తేజోనాథ్, మాజీ ఎంపిపి ఎసి ఎర్రిస్వామి, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, వెలిగొండ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మహిళకు కరపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



పూజలు చేస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో సంకల్ప దీక్ష

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని పంపనూరు సుబ్రమణ్యేశ్వర ఆలయంలో ఆదివారం సంకల్ప దీక్ష, పాల కావడి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రారంభించారు. మూడు రోజులపాటు పెనుగొండకు చెందిన త్రిపుర రిసార్ట్స్ ఎండి గోపీనాథ్ సహకారంతో సంకల్ప దీక్ష గ్రామోత్సవం, పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచే గణపతి పూజ, పంచాంగ వ్యప్రాసనం, స్వామివారి మాలధారణ దీక్ష స్వీకారం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు పల్లకిసేవ, మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ఆలయంలో ఏర్పాటు చేసిన భజన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ అధికారి అక్కిరెడ్డి, ఆలయ ఛైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, అర్చకులు సీతారామ్మోహన్, శర్మ జయరాంశర్మ, కృష్ణశాస్త్రి , ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపిపి పుష్పావతికి సన్మానం



ఎంపిపి పుష్పావతిని సన్మానిస్తున్న అంగన్‌వాడీలు

ఉరవకొండ : నూతనంగా ఎంపికైన విడపనకల్ మండలం ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డిని గడేకల్, ఎన్.తిమ్మాపురం గ్రామాల అంగన్వాడీ సిబ్బంది ఆదివారం సన్మానించారు. ఇందులో భాగంగా ఆయా అంగన్వాడీ సెంటర్లలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లకు ప్రహరీలు, తాగునీరు, కరెంటు తదితర మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులకు నివేదికలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, మాజీ సర్పంచి కరణం భీమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కురుబల అభ్యున్నతికి పాటుపడుదాం

ప్రజాశక్తి-బెలుగుప్ప


ఐకమత్యంతో కురుబల అభ్యున్నతికి పాటుపడదామని కురుబ సంఘం నాయకులు శివలింగప్ప, ఈశ్వరప్ప, శ్రీనివాసులు, నాగరాజు, పరమేశ్వర్, కల్లప్ప పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని స్థానిక గౌరసంద్ర మారెమ్మ ఆలయంలో కనకదాస జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో కనకదాస చిత్రపటాన్ని ఉంచి పురవీధుల గుండా ఊరేగించారు. ఈఊరేగింపులో గొరవయ్యల నృత్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కురుబ సంఘం నాయకులు మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే ఐకమత్యంతో పోరాటాలు చేసి పరిష్కరించుకోవాలని సూచించారు. అలాగే విద్యతోనే ప్రగతి సాధ్యమవుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో విటల్, కరుణాకర్, చెన్నప్ప, శంకరన్న, కల్లప్ప, శివశంకర్, నాగభూషణ, ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.



కనకదాస చిత్రపటాన్ని ఊరేస్తున్న కురుబలు

మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం

పుట్లూరు : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వం విద్య సలహాదారు ఆలూరు సాంబశివరెడ్డి సొంత నిధులతో ఆలూరు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యల్లనూరు మండలం మేడికుర్తిలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం

అనంతపురం కలెక్టరేట్ : ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.వెంకటేశ్వరప్రసాద్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ప్రధాన కార్యదర్శులు ఎర్రిస్వామి, రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 11, 12, 13వ తేదీల్లో బెంగళూరులో నిర్వహించిన అఖిల భారత ఉపాధ్యాయ సమావేశంలో సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం ఎపియుఎస్ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులుగా ఎం. హర్షవర్ధన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎపియుఎస్ జిల్లా కోశాధికారి అన్నం అరవింద్, సభ్యులు శేషగిరి, రమేష్ పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేష్‌పై 'తోపుదుర్తి' వ్యాఖ్యలు అమానుషం


ప్రజాశక్తి-పుట్లూరు

రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి చందు టిడిపి అధినేత చంద్రబాబు, నారా లోకేష్‌పై అసభ్యకరంగా మాట్లాడటం అమానుషమని మండల టిడిపి నాయకులు ఖండించారు. ఆదివారం మండల పరిధిలోని ఎ.కొండాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేఖల సమావేశంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్, పరిటాల కుటుంబంపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే మిమ్మల్ని జిల్లాలో తిరగనీయమని హెచ్చరించారు. పరిటాల రవి బతికున్నప్పుడు మీరు ఎక్కడ దాక్కున్నారో గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఆయన చనిపోయాక దొమ్మీలు, దొంగతనాలు, దౌర్జన్యాలు చేసి పైకి వచ్చారని ఆరోపించారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి తోపుదుర్తి చందుపై 307 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, టిడిపి మండల కన్వీనర్ బాలరంగయ్య, ఐ టిడిపి రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్‌నాయుడు, నాయకులు రవిచంద్రనాయుడు, రామసుబ్బయ్య, సోమశేఖర్‌నాయుడు, శ్రీనివాసులురెడ్డి, గోవర్ధన్ రాజు, రామాంజనేయులు, ఆదినారాయణరెడ్డి, పెద్దయ్య, రామానాయుడు, ప్రసాద్, ఓబులేసు, యేసయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో నిరసనలు

శింగనమల : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు, నారా లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి అరెస్టు చేయాలని టిడిపి అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యుడు దేగల కృష్ణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'చంద్రబాబు, లోకేష్ మా టార్గెట్' చంపుతామని బెదిరిస్తూ మాట్లాడటం బాధాకరమన్నారు. వెంటనే తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డిపై సెక్షన్ 307 ప్రకారం కేసు నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కళ్యాణదుర్గం : చంద్రబాబు, లోకేష్‌పై రాప్తాడు ఎమ్మెల్యే సోదరుడు చందు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిర్వహిస్తూ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో ఆదివారం పట్టణ పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సిఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తోపుదుర్తి చందుపై కళ్యాణదుర్గంలో సిఐకి ఫిర్యాదు చేస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు



విలేకరులతో మాట్లాడుతున్న పుట్లూరు మండల టిడిపి నాయకులు

నార్పల : టిడిపి అధినేత చంద్రబాబు, లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తోపుదుర్తి చందుపై వెంటనే కేసు నమోదు చేయాలని నియోజకవర్గ టిడిపి ద్విసభ్య కమిటీ సభ్యుడు అలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడిన తీరు యావత్తు ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేసేలా ఉందన్నారు. వెంటనే పోలీసులు అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కళ్యాణదుర్గం : పట్టణ సమీపంలోని బళ్లారి-అనంతపురం హైవే రోడ్డు పక్కన ఉన్న నాగులకట్ట వద్ద ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. బెలుగుప్ప మండలం ఎలులవంక గ్రామానికి చెందిన గొల్ల భీమసేన (42) కళ్యాణదుర్గానికి పని నిమిత్తం వస్తుండగా నాగులకట్ట వద్దకు రాగానే కారు వచ్చి ఢీకొంది. వెంటనే తీవ్రంగా గాయపడిన భీమసేనను స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా విషమించి మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతిచెందిన భీమసేన

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కళ్యాణదుర్గం : పట్టణ ప్రాంతానికి అతి దగ్గరగా ఉన్న ఊరుకొండలో ఆదివారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం ఉదయం కొంతమంది యువకులు తేనె కోసం కొండ ప్రాంతంలో సంచరిస్తుండగా గుర్తు తెలియని శవం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు వెళ్లి పూర్తిగా కుళ్లిపోయిన శవాన్ని పరిశీలించారు. దాదాపు రెండు నెలల క్రితమే ఓ పురుషుడు మరణించి ఉంటాడని తెలిపారు. ముఖం, కాళ్లు, చేతులు పూర్తిగా నశించడంతో గుర్తుపట్టేకి వీలు లేకుండా ఉందన్నారు. శవానికి డ్రాయర్ ఉండడంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటికుంటలో పడి విద్యార్థిని మృతి



మృతిచెందిన మధుకీర్తన

పుట్లూరు : నీటికుంటలో పడి విద్యార్థి మృతిచెందిన ఘటన ఆదివారం మండల పరిధిలోని కోమటికుంట గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కోమటికుంట్ల గ్రామానికి చెందిన మధు భూపతి కర్ణ, లక్ష్మీదేవికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. పెద్ద కూతురు మధు కీర్తన పుట్లూరు గ్రామంలోని జడ్పీహెచ్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. ఈనేపథ్యంలో ఆదివారం సెలవుదినం కావడంతో మధు కీర్తన, మేనమామ వేదవతి, తన అమ్మమ్మతో కలిసి పశువులు మేపుకోవడానికి గ్రామ శివార్లలోకి వెళ్లారు. ఈనేపథ్యంలో నీటి కోసం మధుకీర్తన కుంట వద్దకు వెళ్లి బయటకు రాలేదు. దీంతో వేదవతి గట్టిగా అరిచింది. వెంటనే అమ్మమ్మ మధు భూపతి కర్ణకు ఫోన్ చేసింది. ఆయన నీటికుంట వద్దకు చేరుకునేలోపు మధుకీర్తన మృతిచెందింది. దీంతో తల్లిదండ్రులు లబోదిబోమని విలపించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్పై గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

'తుంగభద్ర' కింద రెండో పంటకు నీరివ్వండి..

జల వనరుల శాఖ మంత్రి అంబటికి మాజీమంత్రి కాలవ లేఖ

రాయదుర్గం : తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆయకట్టుకు రెండో పంటకు నీరు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కావల శ్రీనివాసులు ఆదివారం లేఖ రాశారు. ఈఏడాది కర్ణాటకలో కురిసిన భారీ వర్షాల కారణంగా అనంతపురం జిల్లాకు జీవనాధారమైన తుంగభద్ర ఎగువ కాలువకు నీరిచ్చేందుకు తుంగభద్ర రిజర్వాయర్‌లో కావాల్సినంత నీరు అందుబాటులో ఉందన్నారు. కావున హెచ్చెల్సీ వాటా కింద 28.8.2 టీఎంసీ నీటితోపాటు కేసీ కెనాల్ రెండు టీఎంసీ నీటి వాటాను, అధికారులు కేటాయించారన్నారు. అందులో ఇప్పటిదాకా హెచ్.ఎల్.సికి టీబీ డాం ద్వారా 19., 43 టీఎంసీ నీటిని విడుదల చేశారన్నారు. ఇందులో కూడా 184.5 నీరు మాత్రమే ఆంధ్ర సరిహద్దుకు చేరిందన్నారు. ఆంధ్ర కోటా నీటిలో ఇంకా పది టీఎంసీ నీరు మిగిలి ఉందన్నారు. కాగా రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్, కనేకల్‌తోపాటు ఉరవకొండలో కొంతభాగం ఆయికట్టుకు నీరు ఇచ్చే అంశంపై గతవారంలో జరిగిన తుంగుభద్ర జలాశయం అధికారుల సమావేశంలో చర్చించకపోవడం విచారకరమన్నారు. కావున వెంటనే ఈ విషయంపై ఆలోచించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.

అధికారుల గుత్తి కోట సందర్శన యాత్ర

గుత్తి : గుంతకల్లు రెవెన్యూ డివిజనల్ అధికారి జె.రవీంద్ర ఆధ్వర్యంలో అధికారులు ఆదివారం ఎంతో చరిత్ర ఉన్న గుత్తి కోట సందర్శన యాత్ర చేపట్టారు. గుత్తి కోట ప్రాముఖ్యతను వివరించేలా రెవెన్యూ డివిజన్ పరిధిలోని 8 మండలాల తహశీల్దార్లు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అలనాటి రాజుల వేషధారణలో యాత్రగా కోటకు చేరుకున్నారు. గుత్తి తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా దత్త మండలాల కలెక్టర్ సర్ థామస్ మన్రో, విడపనకల్లు తహశీల్దార్ బ్రహ్మయ్య అశోకుడు, వజ్రకరూరు తహశీల్దార్ శివాజీ, పామిడి విఆర్ఓ ఝాన్సీ లక్ష్మీబాయితోపాటు ఉద్యోగులు వివిధ వేషధారణలో గుత్తి కోటను ట్రెక్కింగ్ చేశారు. ఇందులో భాగంగా కోటలోని ఏనుగుల శాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటలు, పాటలు, నత్యాలతో పలువురిని అలరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు తహశీల్దార్ బి.రాము, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, జెవివి మండల ప్రధాన కార్యదర్శి పి.వెంకటరామిరెడ్డి, జిల్లా నాయకులు శ్రీధర్ గౌడ్, ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు డాక్టర్ ఎం సురేష్ బాబు, గుత్తి కోట గైడ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

ఉరవకొండ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి, కీళ్లు, ఎముకలకు సంబంధించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలుకు చెందిన శ్రీచక్ర ఆసుపత్రి సహకారంతో వైద్యాధికారులు శ్రీనివాస్, షాషావలి, తదితరులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 339 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా ఆపరేషన్ కోసం 80 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. 195 మందికి కీళ్లు,ఎముకలకు సంబంధించి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు చందాకేసన్న, రీజియన్ ఛైర్మన్ కొమ్మసాని బాలచంద్ర, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గణేష్‌బాబు, కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ, కోశాధికారి నజీర్‌సాబ్, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సత్యనారాయణ, నాగేశ్వరరావు, జయకృష్ణ, గంగాధర్, జయన్న, శ్రీరాములు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే బిసిల అభ్యున్నతి

బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన, జెఎసి కన్వీనర్ రమేష్ గౌడ్

అనంతపురం కలెక్టరేట్ : ఐక్యమత్యంతోనే బిసిల అభ్యున్నతి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్రావు, జెఎసి కన్వీనర్ బిసి.రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బిసి సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీసీలు రాజ్యాధికార శక్తులుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా గుంటూరు విజయవాడ మధ్యలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి బిసి సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేయడంలో భాగంగా త్వరలోనే బస్సుయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ఎస్ఆర్.నాగభూషణం, జోగి రాజేంద్ర, సంపంగి గోవర్ధన్, వాల్మీకి హరి, నామాల శంకర్, భాస్కర్‌బాబు, సురేంద్రగౌడ్, జస్వంత్‌వ్యాస్, నాగశేషు, సోమపాలెం నాగభూషణ్, బండి అరుణ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం అనంతపురం జిల్లా అధ్యక్షుడిగా జోగి రాజేంద్ర, రాయలసీమ అధ్యక్షులుగా వాల్మీకి హరి, సత్యసాయి జిల్లా అధ్యక్షులుగా నామాల శంకర్, ప్రధాన కార్యదర్శిగా సోంపాలెం నాగభూషణం, రాయలసీమ యువజన అధ్యక్షులుగా జస్వంత్, అనంతపురం జిల్లా యువజన అధ్యక్షులుగా చిట్ర నాగరాజు, ఉపాధ్యక్షులుగా హుస్సేన్, శాలివాహన సుబ్బరాయుడు, సత్యసాయి జిల్లా యువజన విభాగం అధ్యక్షులుగా దుర్గేష్‌తో పాటు 50 మందిని క్రియాశీలక సభ్యులను ఎన్నుకున్నారు.